సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 3 । జూన్ । 2024



సైక్లింగ్..ఆరోగ్య ప్రదాత
ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ తమ దినచర్యలో సైక్లింగ్‌ను ఓ భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. - 8లో▸



ర్యాలీలకు అనుమతి లేదు
పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36^0/28^0
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఈనెల 4న వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఈవీఎంల కౌంటింగ్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రోఅబ్జర్వర్ ఉంటారని తెలిపారు. రౌండ్ ప్రకారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఫలితాలు నమోదు చేస్తారని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా హాల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల సంఘం అబ్జర్వర్లు బండారి స్వాగత్‌చంద్, రాజేశ్‌కుమార్ కౌంటింగ్‌ను పరిశీలిస్తారని తెలిపారు. మూడంచల భద్రత ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. పాస్‌లు లేకుండా అనుమతి ఉండదని, కౌంటింగ్ కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కౌంటింగ్‌కు ప్రతిఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.

ఉత్తమ హెడ్‌కానిస్టేబుల్‌గా సుధాకర్



పతకాన్ని అందుకుంటున్న సుధాకర్

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గుండేటి సుధాకర్ ఉత్తమ హెడ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఎస్పీ కిరణ్‌ఖరే చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు.

అమరేందర్ రెడ్డికి పోలీస్ సేవా పతకం

టేకుమట్ల: టేకుమట్ల ఏఎస్సై పింగిలి అమరేందర్ రెడ్డి ఎస్పీ కిరణ్ ఖరే చేతుల మీదుగా పోలీస్ సేవా పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ సేవా పతకం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

మేడారంలో విత్తన పండుగ



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో సమ్మక్క పూజారులు విత్తన పండుగ పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. రోహిణి కార్తె సందర్భంగా పూజారులు, స్థానిక ఆదివాసీ కుటుంబాలు గ్రామంలోని బొడ్రాయి వద్ద పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు. యాటలను, కోళ్లను మొక్కుకున్నారు. డప్పు చప్పులతో మేడారం సమీపంలోని అడవిలో వనభోజనాలకు వెళ్లారు. వనంలో కొత్త పందిరి వేసి ప్రకృతి దేవతలకు పసుపు, కుంకుమ, కల్లు, సారా సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు, ఆదివాసీ పెద్దలు విత్తనాలు నాటేందుకు ముందుగా వర్షాలు ఏ కార్తెలో బాగా పడుతాయని కొత్త మట్టి కుండలో నీటిని పోసి ఒక్కొక్క కార్తె పేరు చెబుతూ ఇప్పపూలను వదులుతారు. ఆ నీటిలో పూలు పైకి తేలితే వర్షాలు అనుకూలంగా పడుతాయని మునిగితే వర్షాలు బాగా కురువవని గుర్తించడం ఆనవాయితీగా వస్తుందని ఆదివాసీలు వెల్లడించారు. పూజారులు, పెద్దలు కలిసి కుండలోని నీటిలో ఇప్పపూలు వేసి చూశారని తెలిపారు.

7నుంచి ఆరో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మెస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 7 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్.సౌజన్యజి తెలిపారు. 7, 10, 12, 18 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. బయోటెక్నాలజీ ఎనిమిదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 11, 13, 15, 19 తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు.

వీరన్న సన్నిధిలో భక్తజనం

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగుస్తుండడంతో భక్తులు తమ మొక్కులను తీర్చుకునేందుకు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు బారులుదీరి కనిపించారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి

- అమరుల త్యాగాలకు సార్థకత చేకూర్చాలి
- సర్కారు బడుల్లో మెరుగైన విద్యకు నిధులు
- కలెక్టర్ భవేష్‌మిశ్రా
- ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

భూపాలపల్లి: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు. అంకితభావం, సేవాభావంతో పనిచేసి తెలంగాణ అమరవీరుల త్యాగాలకు సార్థకతను చేకూర్చాలని అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం జిల్లాకేంద్రంలోని అమర వీరుల స్తూపానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి కలెక్టర్ పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కలెక్టర్ అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్‌కు చేరుకొని పోలీసులతో గౌరవ వందన స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి నేటితో పదేళ్లు నిండాయి. జిల్లా అంతటా దశాబ్ది వేడుకలను వైభవంగా జరుపుకుంటున్నాం. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమర వీరులందరికీ ఘనంగా నివాళులు అర్పించాం. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి, అందులో భాగంగానే గత సంవత్సరం డిసెంబర్ 28 నుంచి ఈ సంవత్సరం జనవరి 6 వరకు సరికొత్తగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి 241 గ్రామ పంచాయతీల్లో, భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజల నుంచి 1.30 లక్షల దరఖాస్తులు స్వీకరించాం. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాం. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు ప్రభుత్వం పెంచింది. అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత గృహ విద్యుత్‌ను అందించే గృహ జ్యోతి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. రైతు భరోసా, రైతుల రుణమాఫీ పథకాల అమలుతో పాటు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సాగులో మెళకువలు పాటించి డిమాండ్ ఉన్న పంటల సాగు చేపట్టేందుకు వినూత్నంగా జిల్లాలో రైతు నేస్తం కార్యక్రమం చేపట్టాం. జిల్లాలోని రైతు వేదికల్లో రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా రాష్ట్ర అధికారులు, వ్యవసాయ నిపుణులతో ముఖాముఖి మాట్లాడే ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాం. జిల్లాలోని 422 పాఠశాలల్లో రూ.16 కోట్లతో చేపట్టిన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు వేసి, పాఠశాలలు పున:ప్రారంభానికి ముందే జిల్లా అంతటా బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. బడిలో చదివే పిల్లల తల్లుల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. జిల్లాలో శాసనసభ, పార్లమెంటు, శాసనమండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రక్రియకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. కొద్ది రోజుల్లో ఎన్నికల కోడ్ ముగియనున్న నేపథ్యంలో మనందరం పరిపాలనకు పునరంకితం కావాలి. మారుమూల ప్రాంతాలు, నిరుపేదలు, నిరక్ష్యరాస్యులు అధికంగా ఉన్న మన జిల్లాలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అందరం సీనియర్, జూనియర్ అన్న తేడా లేకుండా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ ప్రసంగం అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా



నృత్యంచేస్తున్న సేవాసమితి సభ్యులు, సింగరేణి ఉద్యోగులు



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా



విద్యార్థినికి నోట్‌బుక్స్, పెన్ను పంపిణీ చేస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా



కార్యక్రమం అనంతరం కలెక్టర్, జిల్లా అధికారులు..

ప్రజలకు మరిన్ని సేవలందించాలి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

- ఆవిర్భావ వేడుకల్లో ఎస్పీ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పోలీసులు ప్రజలకు మరింత సేవలందించి చేరువకావాలని ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ కిరణ్‌ఖరే హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పోలీసులు వృత్తినే దైవంగా భావించి పనిచేయాలని, సంఘ విద్రోహుల పట్ల కఠినంగా ఉంటూ, సాధారణ ప్రజలకు భరోసా కల్పిస్తూ వివక్ష లేకుండా ప్రజలందరికీ ఒకే రకమైన సేవలు అందించాలని అన్నారు. అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో మరింత బాధ్యతతో పనిచేసి జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందిస్తూ పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ఎన్నికల విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, కేంద్ర, రాష్ట్రాలకు చెందిన వివిధ పతకాలను అందించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, వర్టికల్ డీఎస్పీ నారాయణనాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వనదేవతలకు భక్తుల మొక్కులు



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలోని సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కంకుమ, చీరసారె, పూలు, పండ్లు, గాజులు, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. యాటలను అమ్మవార్లకు మొక్కుకున్నారు. భక్తుల రద్దీతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. పది రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో మేడారానికి బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దేవాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ జగదీశ్ భక్తులకు అందుబాటులో ఉండి సేవలందించారు.

రూ.20కే అంబలి జావ

మేడారం అమ్మవారి సన్నిధిలో తాడ్వాయికి చెందిన ఓ ఆదివాసీ యువతి అంబలి జావ భక్తులకు విక్రయిస్తోంది. పజ్జొన్న, మొక్కజొన్నల అంబలిని తయారు చేసి గ్లాసు అంబలి జావకు రూ.20 చొప్పున అమ్ముతోంది. దీంతో అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు జావ తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు.

గాలివాన బీభత్సం



కాటారం: జాతీయ రహదారిపై నేలకొరిగిన చెట్టు



మహాముత్తారం: వరి ధాన్యంపై నిలిచిన నీరు

చిట్యాల/కాటారం/మహాముత్తారం: ఆదివారం రాత్రి జిల్లావ్యాప్తంగా గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ గాలి వీచి జన జీవనాన్ని అల్లకల్లోలం చేసింది. చిట్యాల, కాటారం, మహాముత్తారం మండలాల్లో భారీ వర్షం కురిసింది. చిట్యాల మండలం మండలం శాంతినగర్‌లో పిడుగుపడి అన్న రాయమల్లుకు చెందిన జెర్సీ ఆవు మృతి చెందింది. గాలివాన బీభత్సానికి జడలపేట గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కుప్పకూలింది. ఒడితల గ్రామంలో రైతువేదిక పై రేకులు గాలికి కొట్టుకుపోయాయి. చిట్యాల-జడలపేట, ఒడితల-గోపాలపూర్ గ్రామాలకు వెళ్లే దారిలో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు గ్రామాలలో విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. కాటారం మండలకేంద్రంలో సుమారు రెండు గంటల పాటు పెద్ద ఎత్తున గాలి వీయడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాలికి జాతీయ రహదారి 353(సీ)పై మహదేవపూర్ వైపుగా పీహెచ్‌సీ సమీపంలో భారీవృక్షం నేలకొరిగింది. ఎర్రగుంటపల్లిలో రేకుల షెడ్డుపై చెట్టు విరిగిపడింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గాలివాన కారణంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. మహాముత్తారం మండలంలోని నిమ్మగూడెం, కిష్టాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం కుప్పలపై నీరు నిలిచింది. నిమ్మగూడెం గ్రామంలో ఈదురు గాలులకు తాటి చెట్టు విరిగిపడింది. ఆ సమయంలో దారిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



చిట్యాల: ఒడితలలో కొట్టుకుపోయిన రైతు వేదిక పైరేకులు



చిట్యాల: జడలపేటలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్



చిట్యాల: విరిగి రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం



మహాముత్తారం: నిమ్మగూడెంలో తాటిచెట్టు..

తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న పోలం రాజేందర్

కాటారం: పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ ఆరోపించారు. కాటారం మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నీళ్ల పూర్తిస్థాయిలో అందలేదని, నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రంలో ఆత్మగౌరవమే కరువైందన్నారు. నిత్యం ఆదివాసీలపై దాడులు కొనసాగుతున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం అటవీ పట్టాలు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఐదు ఎకరాల వరకే రైతుభరోసా ఇవ్వడం అన్యాయమన్నారు. పది ఎకరాల వరకు రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. పోడుపట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల రాజు, పెద్ది శేఖర్, శరత్ పాల్గొన్నారు.

సాగుకు భరోసా..



వ్యవసాయ రంగంలో నూతన పథకాలు.. ఆవిష్కరణలు

- అందుబాటులోకి నీటి లభ్యత.. మేలైన వంగడాల వృద్ధి
- విత్తనాల దిగుమతి నుంచి ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ
- 'సాక్షి'తో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి

హన్మకొండ: 'వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోంది.. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు పోతున్నాం.. విత్తనాల తయారీ, ఉత్పత్తిలో ముందడుగు వేశాం.. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ విత్తనాలపై ఆధారపడి ఇప్పుడు విత్తనాలు ఎగుమతి చేసే స్థాయికి వచ్చాం.. వివిధ రాష్ట్రాల నుంచి మన విత్తనాలు కావాలని ఇండెంట్ పెడుతున్నారు' అని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి తెలిపారు. ఆదివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

స్వరాష్ట్రంలో మూడు వ్యవసాయ కళాశాలలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయమే ఉండగా.. తెలంగాణ రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ.నరసింహారావు వెటర్నటీ, కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన యూనివర్సిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వరంగల్, జగిత్యాల, పాలెం (మహబూబ్‌నగర్ జిల్లా)లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలకు అనుబంధంగా వ్యవసాయ కళాశాలలను నెలకొల్పింది. గతంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి వ్యవసాయ విద్యనభ్యసించేవారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు పరిశోధనతోపాటు బోధన జరుగుతోంది. వరంగల్‌కు వెటర్నరీ కళాశాల కూడా వచ్చింది.

పెరిగిన సాగువిస్తీర్ణం..

సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయ్యింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నీటి లభ్యత, సాగు విస్తీర్ణం పెరిగింది. ధాన్యం, పత్తి దిగుబడి ఎక్కువగా వస్తోంది. ఇతర రాష్ట్రాలకు ధాన్యం ఎగుమతి చేస్తున్నాం. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు పోతున్నాం. సాగులో వినూత్న పద్ధతులు అవలంబిస్తూ అధిగ దిగుబడి సాధిస్తున్నాం. కూలీల కొరతను అధిగమించేందుకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.

మెరుగైన రైతుల ఆర్థికపరిస్థితి..

సాంకేతికతతో పంట దిగుబడులు పెరగడంతో రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగైంది. అధిక సాంద్రత పత్తితో రైతులు లాభసాటి సాగు చేస్తున్నారు. పత్తి తీసివేసిన తర్వాత మరో పంట సాగు చేస్తున్నారు. గతంలో పత్తి తర్వాత ఈ భూమిలో పంట వేయకుండా వదిలేసే వారు. రైతులు పెట్టుబడి కోసం ఎదురుచూడకుండా ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని తీసుకొచ్చింది. సకాలంలో పెట్టుబడి అందుతుండడంతో విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారు. రైతుబీమా రైతు కుటుంబానికి భరోసా కల్పించింది. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది. బీమా చేయించిన రైతు చనిపోతే ఆ కుటుంబానికి రూ.5 లక్షల సొమ్ము వస్తుంది.

అనుబంధ రంగాలకు ప్రోత్సాహం..

వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన పథకాలు అమలవుతున్నాయి. పశువైద్య, పశుసంవర్థక శాఖ ద్వారా గొర్రెల పంపిణీ పథకం చేపట్టారు. దీంతో పెంపకందారులకు ఆదాయం సమకూరుతోంది. అదేవిధంగా ఉచితంగా చేప పిల్లల పంపిణీతో మత్స్యకారులకు జీవనోపాధి కలుగుతోంది. ఉద్యానశాఖ ద్వారా పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ప్రతీ 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్..

ఏఓలు, ఏఈఓల నియామకాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టింది. ప్రతి 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఒక ఏఈఓను నియమించింది. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించేందుకు, రైతుల సందేహాలు తీర్చుకునేందుకు ప్రతి క్లస్టర్‌లో రైతు వేదిక నిర్మించింది. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రతి మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు రైతులకు అందిస్తున్నారు.

వాట్సాప్ ద్వారా రైతుల సందేహాల నివృత్తి..

వారంలో రెండు రోజులు వాతావరణ పరిస్థితులు వివరిస్తుండడంతో రైతులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అదేవిధంగా పీజేటీఎస్ ఏయూ యూట్యూబ్ చానల్ ప్రారంభించి సాగులో అవలంబించాల్సిన పద్ధతులను వివరిస్తున్నారు. వాట్సాప్ ద్వారా కూడా రైతుల సందేహాలు తీరుస్తున్నాం.



మేలైన వంగడాల వృద్ధి..

రాష్ట్రం ఏర్పాటు తర్వాత వరి, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుములు, పెసర, కుసుమ, నువ్వు తదితర మేలు రకమైన వంగడాలు వృద్ధి చేశాం. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 1010 వరి రకానికి ప్రత్యామ్నాయంగా కునారం సన్నాలు, జేజీఎల్-2423 వంగడాలను తీసుకొచ్చాం. బీపీటీ-5204కు ప్రత్యామ్నాయంగా షుగర్ లెస్ వరి విత్తనం ఆర్ఎన్ఆర్-1504 (తెలంగాణ సోనా)ను రైతులకు అందుబాటులోకి తెచ్చాం. కందిలో ఎల్ఆర్‌జీ-41కి ప్రత్యామ్నాయంగా డబ్ల్యూజీఎల్-97 వంటి విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాం. ఇప్పుడు మన విత్తనాలను ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం మే 24న విత్తన మేళా నిర్వహించి రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నాం.

విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం..

విలువ ఆధారిత ఉత్పత్తులు సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. పంట ఉత్పత్తులకు విలువను జోడిస్తే రైతుకు అధిక ఆదాయం వస్తుంది. ఉదాహరణకు మిర్చి, పసుపును పొడిగా మార్చి విక్రయిస్తే రైతులకు అధిక ఆదాయం వస్తుంది. భవిష్యత్‌లో ఈ విధానం పెద్ద ఎత్తున ఆచరించే అవకాశముంది. తాండూరు కంది పప్పు జీఐ ట్యాగ్ సాధించింది.

రైతుల వద్దకే వ్యవసాయ అధికారులు..

జిల్లాల పునర్విభజన తర్వాత రైతుల ముంగిటికి జిల్లా వ్యవసాయ అధికారులు వస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారుల సంఖ్య గతంలో కంటే పెరిగింది. తద్వారా రైతులకు వ్యవసాయ అధికారుల సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. ఏజీ హబ్ ద్వారా గ్రామీణ ప్రాంత యువ రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్స్ అందుబాటులోకి తీసుకొచ్చాం.

డీసీసీబీలో నూతన డిపాజిట్ స్కీం



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రవీందర్‌రావు

హన్మకొండ : వరంగల్ డీసీసీబీలో నూతన డిపాజిట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్లు చైర్మన్ మార్నేని రవీందర్ రావు తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకం స్కీమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకం 365 రోజుల కాలపరిమితితో ఏర్పాటు చేశామని, 8.10 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. రైతులు, ప్రజలు దశాబ్ది డిపాజిట్ పథకం ద్వారా పొదుపు చేసి అధిక వడ్డీ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎం, ఏజీఎం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



చల్లగరిగలో ఆవు కళేబరం

చిట్యాల : మండలంలోని శాంతినగర్ శివారులో ఆదివారం పిడుగుపడి అన్న రాయమల్లుకు చెందిన ఆవు మృతిచెందింది. ఇంటి వెనకాల పెరట్లో ఆవును కట్టివేయగా ఆకస్మికంగా గాలిదుమారం రాగా వర్షంతో పాటు పిడుగుపడి ఆవు మృతి చెందినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఆవు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

విద్యుదాఘాతంతో..

మండలంలోని చల్లగరిగకు చెందిన కర్రె మహేందర్‌రెడ్డికి చెందిన ఆవు విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృతి చెందింది. ఉదయం గ్రామ శివారులో మేతకు వెళ్లిన ఆవు 11కేవీ విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు.

నగదు, బైక్‌తో పరారీ.. కేసు నమోదు

ఖిలా వరంగల్ : వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఏకశిలనగర్ కాలనీకి చెందిన ఎం.నగేష్ తన కుటుంబంతో సహా ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లాడు. కాగా నగేష్‌కు సమీప బంధువు చంటి అదే రోజు ఏకశిలనగర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న విజయవాడకు చెందిన అంబాల ప్రభుదాస్ చంటిని పలకరించాడు. మాటలతో మభ్యపెట్టి హనుమకొండ ఆస్పత్రికి వెళ్లి వస్తా నీ బైక్ ఇవ్వవా అని చంటిని అడిగి బైక్ తీసుకోని పరారయ్యాడు. వారం రోజులైనా ప్రభుదాస్ జాడలేదు. దీంతో రూ.3.50 లక్షల అప్పులు చేసి బైక్‌పై విజయవాడకు పరారైనట్లు గుర్తించారు. బాధితుడు ఎం.నగేష్ మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆదివారం ప్రభుదాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సైక్లింగ్.. ఆరోగ్య ప్రదాత

సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఒత్తిడి దూరం | మధుమేహ నియంత్రణ.. చురుకుదనం | నేడు ఇంటర్నేషనల్ బైస్కిల్ డే

పాలకుర్తి టౌన్ /కాజీపేట అర్బన్ /గీసుకొండ : సైకిల్ డ్రైవ్ కనుమరుగైంది. కాలు బయట పెడితే ఖరీదైన కారు.. లేదా వాయువేగంతో దూసుకెళ్లే ద్విచక్రవాహనం.. ఇది నేటి సమాజ ధోరణి. వెరసి పిల్లల నుంచి పెద్దల వరకు ఉబకాయం, రక్తపోటు, మధుమేహం తదితర అనారోగ్య సమస్యలు.. ఫలితంగా ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యులు పరీక్షలన్నీ చేశాక రేపటి నుంచి సైక్లింగ్ చేయండి.. అరోగ్య సమస్యలన్నీ పటాపంచలవుతాయని చెబుతున్నారు. ఆరోగ్య ప్రదాతైన సైక్లింగ్ నేటి కాలంలో కనిపించకుండా పోయింది. ఇప్పటికైనా ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ రోజూ తమ దినచర్యలో సైక్లింగ్‌ను ఓ భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. డాక్టర్లతోగాని, మందులతోగాని అవసరం ఉండదు. నేడు (సోమవారం) ఇంటర్నేషనల్ బైస్కిల్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

జూన్ 3న సైక్లింగ్ దినోత్సవం..

సైకిల్.. ఒకప్పుడు గొప్ప వాహనం. కలల సౌదం. కాలం మారింది. బైక్‌లు, కార్ల కాలం వచ్చింది. ఫలితంగా సైకిల్ తొక్కేవారు తగ్గిపోయారు. పైగా సైకిల్ తొక్కడం గిల్టీగా ఫీల్ అవుతున్నారు. దీంతో 80 శాతం మంది ప్రజలు శారీరక శ్రమ తగ్గి మానసిక ఒత్తిడి, ఉబకాయం, మధుమేహం తదితర బారిన పడుతున్నారు. దీంతో ప్రజలకు సైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలు, అవశ్యకతను తెలిపేందుకు 2018 ఏప్రిల్‌లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ జూన్ 3వ తేదీని ప్రపంచ సైక్లింగ్ దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున సైక్లింగ్‌తో శరీరానికి కలిగే ప్రయోజనాలు, ప్రజలలో అవగాహన పెంచేందుకు నగరాలు, పట్టణాల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వాల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు.



కాజీపేట అర్బన్: ఇంటర్నేషనల్ బైస్కిల్ డే వేడుకల్లో నిట్ విద్యార్థులు (ఫైల్)

మలినాలు చెమట రూపంలో బయటకు..

శరీరంలోని మలినాలు చెమట రూపంలో తొలగించి గుండె, ఊపిరితిత్తులు, మెదడు, కాళ్లు, చేతుల కండరాలు, కీళ్లు వంటి అవయవాలను బిగుతుగా ఉంచేందుకు సైక్లింగ్ ఎంతో ఉపయోగపడుతుంది. ప్రత్యేకించి నడుము, తొడలు, పిక్కలు, ఎముకలు బలపడతాయి. దీంతో మానవుడు తన దైనందిన కార్యక్రమాలు చురుకుగా చేసుకుంటాడు. శరీరంలోని జీవక్రియలు పుంజుకుని కొవ్వు కరుగుతుంది.

నేడు నిట్‌లో వేడుకలు..

నిట్ వరంగల్‌లోని నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బైస్కిల్ డే వేడుకలు విద్యార్థులు ఘనంగా జరుపుకుంటారు. అలాగే, ఫైనల్ ఇయర్ విద్యార్థులు తాము ఉపయోగించిన సైకిళ్లను జూనియర్స్‌కు బహుమతిగా ఇచ్చి వెళ్లడం ఆనవాయితీ. దీంతో నిట్ క్యాంపస్‌లో ఇప్పటి వరకు సుమారు 3వేల సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్స్ అందజేసిన సైకిళ్లకు మరమ్మతులు చేపట్టి జూనియర్స్‌కు తీసుకువస్తారు. దీంతో రోజూ విద్యార్థులు తమ హాస్టల్ నుంచి క్లాస్ రూమ్, ల్యాబ్స్, గ్రౌండ్‌కు సుమారు 5 నుంచి 10 కిలోమీటర్ల ప్రయాణం కొనసాగిస్తుంటారు.

సైక్లింగ్‌తో ఫిజికల్ ఫిట్‌నెస్



2016 నుంచి క్రమం తప్పకుడా సైకిల్ తొక్కుతున్నా. రోజు సుమారు గంట సమయం సైక్లింగ్ చేస్తా. ఎలాంటి జబ్బులు దరిచేరలేదు. ఆరోగ్యంగా ఉన్నా. మా డిపార్టుమెంట్‌లో ఫిట్‌నెస్ చాలా అవసరం. సైక్లింగ్‌తో అది సాధ్యం. అలాగే, ప్రకృతిని ఆస్వాదిస్తూ శరీరానికి ప్రాణవాయువు అందిపుచ్చుకోవచ్చు. సైక్లింగ్‌తో కీళ్ల నొప్పులు, ఉబకాయం తగ్గడతో పాటు మానసిక పరిపక్వతలో మార్పులు వస్తాయి.

- గట్ల మహేందర్‌రెడ్డి, సీఐ, పాలకుర్తి

సైక్లింగ్‌తో చలాకీతనం..



సైక్లింగ్ అంటే నాకు చాలా ఇష్టం. రోజుకు 30 నుంచి 40 నిమిషాలు సైక్లింగ్ చేస్తా. సైక్లింగ్ చేయడంతో రోజంతా చలాకీగా ఉంటున్నా. మెదడులోని నరాలకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. ఫలితంగా మెదడు చురుకుగా పని చేస్తుంది. అంతేకాకుండా వయసు పెరుగుతున్నా సైక్లింగ్ చేస్తున్నవారు యవ్వనంగానే కనిపిస్తుంటారు.

- మోడెం సాయిప్రసన్నకుమార్, ఎస్సై, పాలకుర్తి

'సైకిల్' పోలీస్..!



సైక్లింగ్ చేస్తూ జాతీయ జెండాతో జయరాజు

గీసుకొండ మండలం ధర్మారానికి చెందిన జి. జయరాజు హెడ్ కానిస్టేబుల్. ప్రస్తుతం మడికొండ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఉంటున్నది హనుమకొండ ఫారెస్టు ఆఫీస్ సమీపంలో .. అక్కడి నుంచి మడికొండ పోలీస్ స్టేషన్‌కు చాలాసార్లు సైకిల్‌పైనే వెళ్లి వస్తుంటాడు. వరంగల్‌కు నలుదిక్కులా ఉన్న రహదారులను ఇప్పటికే ఎన్నోసార్లు చుట్టివచ్చాడు. ఐదు పదుల వయసు దాటిన జయరాజు .. సైకిల్ తొక్కిన ప్రతి ఉదయం కనీసం 30 కి.మీ. మేర ప్రయాణం చేసి ఇంటికి చేరుకుంటాడు. ఇప్పటి వరకు సుమారు 9 వేలకు పైగా కిలోమీటర్లు సైక్లింగ్ చేశాడు. దీంతో పోలీసు అధికారులు అతడిని ప్రశంసించారు. ఇప్పటికే వరంగల్ ట్రై సిటీ క్లబ్‌లో మెంబర్, అలాగే బాలసముద్రం ఏజీ పెడెల్స్ వారు నిర్వహించిన పోటీల్లో రెండు సార్లు పాల్గొని ప్రతిభ చాటాడు. కేరళ, ఢిల్లీ, తమిళనాడులో నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో ముందు నిలిచి పలుమార్లు ప్రశంసపత్రాలు అందుకున్నాడు. సైక్లింగ్‌తో తనకు బీపీ, షుగర్ రాలేదని, మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ చేపలు, శాఖాహారం తింటూ ఫిట్‌గా ఉన్నానని జయరాజు తెలిపారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

- సీపీ అంబర్ కిశోర్ ఝూ

వరంగల్ క్రైం : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు..ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసులు నమోదు చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తెలిపారు. రేపు (మంగళవారం) ఏనుమాముల మార్కెట్‌లో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందు గాను ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు ముగ్గురు డీసీపీలు, పది మంది ఏసీపీలు, 29మంది ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్సైలు 52 మంది, ఏఎస్సైలు, 77మంది హెడ్ కానిస్టేబుళ్లు, 172 మంది కానిస్టేబుళ్లు, 48 మంది మహిళా కానిస్టేబుళ్లు, 44 మంది హోంగార్డులు, 32మంది క్యూఆర్ టీమ్స్, మూడు టీజీఎస్పీ ప్లాటూన్స్‌తో పాటు బాంబ్ డిస్పోజబుల్ బృందం, కమ్యూనికేషన్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజున 144 సెక్షన్ అమలుల్లో ఉంటుందని, ఎలాంటి ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతి లేదని ఆయన పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



నగదును చూపుతున్న ఎస్సై వెంకన్న

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ చెరువు పక్కనే ఉన్న బోడు వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కొందరు డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో దాడి చేయగా సిరికొండ వీరస్వామి, ఆలకుంట్ల సంపత్, గార్ల సుధాకర్, ముప్పిడి రామచందర్‌ను పట్టుకున్నారు. శివరాత్రి రాజు, సంపంగి చిరంజీవి, మేకల అశోక్ పారిపోయినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్‌లు, రూ.19,760లను స్వాధీనం చేసుకున్నారు. కాగా వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దామెర ఎస్సైపై చర్య తీసుకోవాలి

- పోలీస్ కమిషనర్‌కు బాధితుల వేడుకోలు



వివరాలు వెల్లడిస్తున్న గాజు నాగరాజు,శ్యాంయాదవ్

హన్మకొండ చౌరస్తా: పోక్సో చట్టంలో నిందితులుగా ఉన్న వ్యక్తులకు అండగా ఉంటూ, కనీస విచారణ జరపకుండానే తమపై కేసు నమోదు చేసిన హనుమకొండ జిల్లా దామెర ఎస్సై కొంక అశోక్ పై చర్యలు తీసుకోవాలని బాధితులు వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూను కోరారు. ఆదివారం సీపీని కలువడానికి బాధితులు హనుమకొండకు వచ్చారు. అయితే సీపీ అందుబాటులో లేకపోవడంతో పబ్లిక్‌గార్డెన్‌లో విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాధితులు గాజు నాగరాజు, శ్యాంయాదవ్ కథనం ప్రకారం.. దామెర మండలం కోగిల్వాయికి చెందిన గాజు నాగరాజు కూతురు (బాలిక)ను అదే గ్రామానికి చెందిన పెరుగు రాజు మాయమాటలు చెప్పి, బలవంతంగా గత ఏడాది పెళ్లి చేసుకున్నాడు. అయితే మానసికంగా వేధింపులకు గురి చేయడంతో పెళ్లైనా మూడు నెలలకే ఆత్మహత్య చేసుకుంది. దీంతో తన కూతురు ఆత్మహత్య పై నాగరాజు దామెర పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పెరుగు రాజు, అతడి తండ్రి చేరాలు, తల్లి కోమలతో పాటు మేనత్త బుచ్చమ్మ, మామ రాజాలుపై పోక్సో చట్టం నమోదు చేశారు. పెరుగు రాజు, తల్లిదండ్రులు జైలుకు వెళ్లి ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చారు. పెరుగు రాజు మేనత్త బుచ్చమ్మ, మామ రాజాలు జైలుకు వెళ్లలేదు. అయితే ఐదుగురు పై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని పెరుగురాజు తరపు పెద్దమనుషుల నుంచి నాగరాజు కుటుంబం పై ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించారు. అయినా నాగరాజు కుటుంబీకులు పగ పెంచుకున్న రాజు మేనత్త బుచ్చమ్మ, రాజాలు గత నెల 31వ తేదీన నాగరాజు సోదరుడు శ్యాం చెలుక వద్ద ఉండగా, పక్కనే ఉన్న వారి చెలుక వద్దకు వచ్చి గొడవకు దిగారు. మాటామాటా పెరగడంతో బుచ్చమ్మ, రాజాలు, అతని కొడుకు జల్ల నాగరాజు.. శ్యాం, నాగరాజుపై దాడికి దిగారు. ఇరువర్గాల మధ్య జరిగిన గొడవతో ఇరువురు పోలీసులను ఆశ్రయించారు. ఉదయం 11గంటలకు ఫిర్యాదు చేయగా సాయంత్రం 5గంటల వరకే తమపై హత్యాయత్నం కేసు నమోదు చేశాడని, పోక్సో చట్ట ప్రకారం నిందితులుగా ఉన్న బుచ్చమ్మ, రాజాలు కొడుకైన నాగరాజు ఫిర్యాదుని తీసుకున్న ఎస్సై అశోక్.. ప్రాథమిక విచారణ చేయకుండా తమ పై కేసు నమోదు చేశారన్నారు. పోక్సో కేసు వెనక్కి తీసుకోకపోవడంతో కక్ష పెంచుకుని తమపైనే దాడి చేసి ఎస్సై ప్రోద్బలంతో తిరిగి తమపైనే కేసు నమోదు చేశారని మృతి చెందిన బాలిక తండ్రి గాజునాగరాజు, సోదరుడు శ్యాంయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసు కమిషనర్ విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

జాతీయ పతాకానికి అవమానం



హసన్‌పర్తి: జాతీయ పతాకానికి అవమానం జరిగింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతగట్టులోని పశు ఆరోగ్య ఉపకేంద్రంలో ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అయితే కొంతమంది అకతాయిలు జెండాను కింద పడేయడమే కాకుండా మద్యం తాగి అక్కడే బాటిళ్లు వదిలేశారు.ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి టౌన్ : అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దర్దెపల్లిలో జరిగింది. ఎస్సై సాయిప్రసన్నకుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నిమ్మల యాకయ్య (50)వ్యవసాయంతో పాటు కుటుంబ అవసరాలకు సుమారు రూ. 5లక్షల వరకు అప్పు చేశాడు. అయితే అప్పు తీర్చే మార్గం కనిపించక శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు పాలకుర్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య హేమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బోరు లారీ బోల్తా.. ఒకరి దుర్మరణం

- ముగ్గురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- వడ్లకొండలో ఘటన



భోజయ్య (ఫైల్)

జనగామ రూరల్: అదుపు తప్పి ఓ బోరు లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని వడ్లకొండ దుర్గమ్మ గుడి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వడ్లకొండ గ్రామంలో ఒక రైతు పొలంలో బోరు వేస్తుండగా వర్షం పడుతోంది. దీంతో లారీ నిర్వాహకులు తీరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో గ్రామంలోని దుర్గమ్మ గుడి సమీపంలో బోరు లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా కలిమెల మండలం కొత్తగూడకు చెందిన భోజయ్య (24) అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురు పండు స్వల్ప, పూర్ణ, శంకర్‌రావుకు తీవ్రగాయాలలయ్యాయి. పండు జనగామ జిల్లా ఆసుపత్రిలో, పూర్ణ, శంకర్‌రావును వరంగల్ ఎంజీఎం తరలిచారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. కాగా, మృతుడు 5 రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లాడు. తిరిగి ఈ రోజే పనిలో చేరాడు. పనిలో చేరిన రోజే మృతి చెందడం పలువురిని కలిచివేసింది. మృతుడికి ముగ్గురు అన్నదమ్ములు, ఒక చెల్లి ఉంది. తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందారు.

వడదెబ్బతో ఐదుగురి మృతి

వడదెబ్బతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం ఐదుగురు మృతి చెందారు. ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘణపురం గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్, సంగెం మండలం లోహితలో యువకుడు, గీసుకొండ మండలం ఎలుకుర్తి హవేలిలో మరో యువకుడు, గార్ల మండలం రాంపురంలో వృద్ధురాలు, పర్వతగిరి మండలం కల్లెడలో గొర్రెల కాపరి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



అమీన్‌ఖాన్ మృతదేహం

ఏటూరునాగారం: వడదెబ్బతో ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన ఏటూరు నాగారంలో జరిగింది. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం గ్రామానికి చెందిన అమీన్‌ఖాన్(39) కొద్ది రోజులుగా ఇసుక క్వారీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పనిచేస్తుండగా సొమ్మసిల్లిపడిపోయాడు. హుటాహుటిన సామాజిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఫరీదా, నలుగురు పిల్లలున్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అయూబ్ ఖాన్ కోరారు.

లోహితలో యువకుడు..



జీవన్‌రావు(ఫైల్)

సంగెం : వడదెబ్బతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు కథనం ప్రకారం సంగెం మండలంలోని లోహితకు చెందిన అడ్డగట్ల జీవన్‌రావు(35) ఆదివారం ఉదయం వరిగడ్డి కట్టలు తీసుకురావడానికి పొలం వద్దకు వెళ్లాడు. ఒకసారి వెళ్లి తీసుకుని వచ్చి రెండోసారి ట్రాక్టర్‌తో పొలం వద్దకు వెళ్లాడు. మిగిలిన వారు గడ్డి కట్టలు ట్రాక్టర్‌లో వేస్తుండగా జీవన్‌రావు వెళ్లి పడుకున్నాడు. దీంతో వడదెబ్బతో అస్వస్థతకు గురై మృతి చెందాడు.

ఎలుకుర్తిహవేలిలో యువకుడు..

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలికి చెందిన కొత్తకొండ కుమారస్వామి(28) వడదెబ్బతో మృతి చెందాడు. కుమారస్వామి ఆదివారం కూలీ పని చేస్తున్న చోటే స్పృహతప్పి పడిపోయాడు. విషయం తెలుసుకున్న బంధువులు 108లో వరంగల్ ఎంజీఎం తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు గీసుకొండ సీఐ పవన్ కుమార్ తెలిపారు.

రాంపురం గ్రామంలో వృద్ధురాలు..



పాలడుగు దర్గమ్మ (ఫైల్)

గార్ల : వడదెబ్బకు గురై వృద్ధురాలు మృతిచెందిన సంఘటన రాంపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రాంపురం గ్రామానికి చెందిన పాలడుగు దర్గమ్మ(75) వడగాల్పులు, ఎండతీవ్రతను తట్టుకోలేక వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై తెల్లవారుజామున మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

కల్లెడలో గొర్రెలకాపరి..



సాయిలు యాదవ్(ఫైల్)

పర్వతగిరి: వడదెబ్బతో ఓ గొర్రెలకాపరి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రబోయిన సాయిలుయాదవ్ (48) రోజు వారీగా గొర్రెలు మేపడానికి వెళ్లాడు. ఎండకు అస్వస్థతకు గురై గుర్రై మృతి చెందాడు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: ఎన్పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాల పరిధిలో 70 లక్షల మంది వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. అధికారులు, ఉద్యోగులు ముందు ఎన్పీడీసీఎల్ కార్యాలయం నుంచి సుబేదారిలోని తెలంగాణ అమరుల కీర్తి స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ వరుణ్ రెడ్డి జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాదితో పోల్చుకుంటే 33, 11 కేవీలో బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ తగ్గాయన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌పార్మర్ల వైఫల్యాలు తగ్గాయని వివరించారు. వ్యవసాయ వినియోగదారులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. త్వరలో కస్టమర్ రిసెప్షన్ డెస్క్ ప్రారంభించబోతున్నామని, దీని వల్ల వినియోగదారుడి ఫిర్యాదులు తీసుకుని వారికి ఫిర్యాదు తాలూకు రశీదు కూడా ఇస్తామన్నారు. వారి ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తామన్నారు. వివిధ పారామీటర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రతి నెల బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్ అవార్డులు అందిస్తున్నామన్నారు. వినియోగదారులకు వేగవంత సేవలు అందించడానికి కార్యకలాపాల నిర్వహణ ప్రక్రియను డిజిటలైజేషన్ చేశామని తెలిపారు. మొబైల్ యాప్ కూడా డెవలప్‌చేశామని, ప్రతి ఒక అంశం అందులో పొందుపరిచామన్నారు. ఉద్యోగులకు మరింత తర్ఫీదు అందించాలనే లక్ష్యంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రతి సర్కిల్ పరిధిలో నిర్వహణ తరగతులు నడుస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా బెస్ట్ ఫర్ఫారెన్స్ ఆఫ్ ది మంత్ అవార్డులు అందించారు. 144 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతి రెడ్డి, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు టి.మధుసూదన్, రాజుచౌహాన్, అశోక్, కిషన్, కేఎస్ గుట్ట, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం, ఎస్ఈ సివిల్ అంకుస్, తదితరులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య

ధర్మసాగర్ : వేధింపులు తట్టుకోలేక కట్టుకున్న భర్తను కడతేర్చిందో భార్య. ధర్మసాగర్ మండలంలోని క్యాతంపల్లి గ్రామానికి చెందిన మోడెం రమేశ్ (36) ఎఫ్‌సీఐలో పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. అయితే రమేశ్ మద్యానికి బానిసై రోజు తన భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం భార్య స్వాతి, పిల్లలను, అత్తను బాగా కొట్టి చంపుతానని బెదిరించాడు. దీంతో భార్య పిల్లలు ఇంటి పక్కనే ఉన్న ఇసుక కుప్పపై పడుకున్నారు. కాగా తన భర్త బతికి ఉంటే ఎలాగైనా చంపుతాడన్న భయంతో అదే రోజు రాత్రి స్వాతి, ఆమె తల్లి అటికం లక్ష్మి కర్రతో రమేశ్ తలపై కర్రతో గట్టిగా కొట్టగా ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ మహేందర్ తెలిపారు.